www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 24 జనవరి 2024

5



321 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

పడమర ఖండ్రిక గ్రామ సచివాలయం లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు . ఈ సందర్భంగా జరిగిన వైద్య శిబిరంలో డాక్టర్ జి.శ్రావణి, అభిలాష్, డాక్టర్ పిఎన్ఎస్‌డి.రత్నకుమారి, ఎస్.సత్యనారాయణ, పలువురు వైద్య నిపుణులు పలు వ్యాధులకు సంబంధించి 321 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. వైయస్సార్ కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి 14 మందికి కళ్ళజోళ్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లు హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, సచివాలయం సిబ్బంది ఎఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు .

డ్వాక్రా మహిళలకు 'ఆసరా'


- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నాలుగో విడతలో 31,093 సంఘాలకు రూ.254.24 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి-అమలాపురం

అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల ఆఖరి నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా నిధులను పొదుపు సంఘాల ఖాతాల్లో బటన్ నొక్కి వర్చువల్ విధానంలో జమ చేసే కార్యక్రమాన్ని సిఎం జగన్ మంగళవారం ప్రారంభించారు.

అమలాపురం కలెక్టోరేట్‌లో ఈ సందర్భంగా జరిగిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పిపిపే విశ్వరూప్ మాట్లాడారు. గత ఎన్నికల ముందు డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తానంటూ ఇచ్చిన హామీకి అనుగుణంగా రుణ విముక్తుల్ని చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకుందని తెలిపారు. ఆసరా నిధులు ఫిబ్రవరి 5 వరకు రెండు వారాలు పాటు మహిళల ఖాతాలో జమ కానున్నాయన్నారు. ఈ పథకం వల్ల మహిళా సాధికారత, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళల యొక్క ఆర్థిక పురోగతికి మేలు చేకూరుతుంద న్నారు. 2019 ఏప్రిల్ 11 నాటికి అక్క చెల్లమ్మలకు ఉన్న పొదుపు సంఘాల బ్యాంకు రుణాల అప్పు నిల్వ మొత్తం సొమ్మును 4 దఫాలుగా నేరుగా వారి సంఘం పొదపు ఖాతాలకు జమ చేయ డానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసు కొని ఇచ్చిన హామీని అమలు చేస్తోందన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్క చెల్లెమ్మ లు వారి కాళ్ళ మీద వారు నిలబ డేటట్లుగా జీవనో పాధులు మెరుగుపడేలా సున్నా వడ్డీ తదితర పథకాల ద్వారా సుస్థిరమైన ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేసిందన్నారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు బహుళ జాతి కంపెనీల ద్వారా విక్రయాలు చేయడంతో పాటు వారికి బ్యాంకుల ద్వారా రుణాలు సులభతరంగా అందేలా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగో విడతలో 31,093 సంఘా లకుగాను రూ.254.24కోట్ల మీద లబ్ధి చేకూరుతుందన్నారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 4,422 సంఘాలకు రూ.37 కోట్లు, కొత్తపేట నియోజకవర్గంలో 6,333 సంఘాలకు రూ.55.07 కోట్లు, మండపేట నియోజవర్గంలో 4,573 సంఘాలకు రూ.37.63 కోట్లు, ముమ్మిడివరం నియోజకవర్గంలో 3,498 సంఘాలకు రూ.24.60 కోట్లు, పి గన్నవరం నియోజకవర్గం లో 5,469 సంఘాలకు రూ.42.64 కోట్లు, రామచంద్రపురం నియోజవ ర్గంలో 2,851 సంఘాలకు రూ 23.50 కోట్లు, రాజోలు నియోజ కవర్గంలో 3,947 సంఘాలకు రూ.33.80 కోట్లు వెరసి కోనసీమ జిల్లా వ్యాప్తంగా 31,093 సంఘాల కు రూ.254.24 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ద్వారా 2,659 సంఘాలకు రూ.22.17 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చింతా అనురాధ, ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ రావు, హితకారిణి సమాజం ఛైర్మన్ కాశీ బాల ముని కుమారి, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ అధ్యక్షులు పికె.రావు, వక్ఫ్ బోర్డ్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖాదర్, పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, డిఆర్ డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, ఎపిడి, ఎంఎం.జిలాని తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

అమలాపురం అల్లవరం మండలంలో అల్లవరం గ్రామంలో వైయస్సార్ ఆసరా సంబరాలునిర్వహించారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పాల్గొని మాట్లాడుతూ గత మూడు విడతలుగా పొదుపు సంఘాల ఖాతాలకు నిధులు జమ చేయడంతో పాటు ఆఖరి విడత నిధులను జమ చేయడం జరిగిందన్నారు. ఎంపీ చింతా సభ్యురాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతిని సర్వతోముఖాభివద్ధిని కాంక్షించి పలు కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకొని కుటుంబాలలో వెలుగులు నింపుకోవాలని సూచించారు ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాల మూలంగా ఒక్కో కుటుంబం 2 లక్షల నుండి 7 లక్షల వరకు లబ్ధిని ఆర్జించిందని ఆమె స్పష్టం చేశారు ఈ కార్యక్ర మంలో ఎంఎల్‌సిలు బొమ్మి ఇజ్రాయిల్, కుడిపూడి సూర్యనారాయణ రావు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలమణి రుద్ర, ఎంపీపీ శేషారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరాతో మహిళలకు పురోభివృద్ధి

ఆలమూరు వైసిపి ప్రభుత్వం మహిళల పురోభివృద్ధి కోసం వైఎస్ఆర్ ఆసరా పథకం ప్రవేశపెట్టి అందజేస్తున్నారని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరు ఎస్ జె ఆర్ ఫంక్షన్ హాల్ నందు ఎంపిపి తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన ఎంపిడిఒ కె.జాన్ లింకన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నాలుగో విడత వైయస్సార్ ఆసరాకు సంబంధించిన సంబరాల్లో ఆయన మంగళవారం పాల్గొని చెక్కు ఆవిష్కరించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ నాలుగు విడతలకు గాను ఇప్పటికే మూడు విడతలు అందజేసినట్లు, నేటి నుండి 4వ విడత ఈనెల 31 వరకు వారోత్సవాలు నిర్వహిస్తూ లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. అలాగే ఆయా గ్రామ మహిళ సంఘాలకు పూర్తి వివరాలు అందజేస్తామన్నారు. అనంతరం జగన్ చిత్రపటానికి వారు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్, ఎఎంసి ఛైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైసిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల చెక్‌పోస్టుల వద్ద నిఘా

ప్రజాశక్తి-అమలాపురం

పార్లమెంట్, శాసనసభకు త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్లను అన్ని విధాలుగా ప్రలోభాలకు గురి చేసే మద్యం, నగదు, విచ్చలవిడిగా రవాణా కాకుండా సరిహద్దు ప్రాంతాల చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా వ్యవస్థలను అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు సంబం ధిత అధికారులకు సూచించారు. మంగళ వారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఉన్నత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికలకు నిర్వహణకు సంబంధించి ఎన్నికల నిర్బంద నిర్వహణ వ్యవస్థ శిక్షణ పై 26 జిల్లాల అధికారులతో మద్యం, నగదు, లిక్కర్ బల్కుగా రవాణా కాకుండా తీసుకోవాల్సిన సాంకేతిక అంశాలపై అవగాహన పెంపొందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు శిక్షణ ద్వారా పొందిన సాంకేతికతను అన్వయించుకుని పూర్తి అవగాహనతో ఓటర్లను వివిధ రకాలుగా ప్రలోభాలకు గురి చేసే అంశాలపై ప్రత్యేక దష్టిని కేంద్రీకరించాలన్నారు. బ్యాంకర్లు బల్క్‌గా నగదు విత్ డ్రా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ చెక్ పోస్ట్ ఓటర్లను ప్రభావితం చేసే రీతిలో బల్కుగా గిఫ్ట్ గా ఇచ్చే వెండి, బంగారం ఆర్టికల్స్ రవాణా కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్ఇబి అధికారులు మద్యం బల్కు రవాణాపై దృష్టి పెట్టాలన్నారు. అటవీ చెక్ పోస్ట్ ల వద్ద కూడా ఓటర్లను ప్రభావితం చేసే బహుమతుల బల్క్ రవాణా అంశాలపై నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు చేసిన తనిఖీల ద్వారా నిర్బందించిన వివరాల ఆన్‌లైన్ రిపోర్టింగ్ కోసం కమిషన్ ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెం ట్ సిస్టమ్ ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్ర మంలో వాణిజ్య పన్నులు లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.శ్యాంబాబు, ఎస్ఇబి అధికారులు, ఎక్సైజ్ తదితర శాఖలకు చెందిన అధికారులు, డిఎఫ్ఒ ఎంవి ప్రసాదరావు, కలెక్టరేట్ సెక్షన్ అధికారి పి.సుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డిఆర్ఓ సత్తిబాబు

యుటిఎఫ్ సేవలు ప్రశంసనీయం

ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి

ప్రజాశక్తి-ఆలమూరు

యుటిఎఫ్ ఉపాధ్యాయుల కోసం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి కొనియాడారు. మండలంలోని కొత్తూరు ఎస్జెఆర్ ఫంక్షన్ హాల్ నందు యుటిఎఫ్ ప్రచురించిన ఫోన్ డైరీ ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్ష విధానంలో వచ్చిన మార్పులు వలన యుటిఎఫ్ ప్రచురించి వితరణ చేస్తున్న పలు రకాల బుక్స్ ఉపాధ్యాయులతో పాటు మనందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. మోడల్ టెస్ట్ పేపర్లు ప్రింటింగ్ చేసి ఉచితంగా పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయడం వారి సేవ దక్పథం తెలుపుతుందన్నారు. వీటిని ప్రతి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు ఉపయోగించుకుని ఎక్కువ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వైవివి. రమణ, అద్దరి శ్రీనివాసరావు, మూర్తి, నాగేశ్వరరావు, భాస్కరరెడ్డి, వైసిపి నేతలు పాల్గొన్నారు.



బుక్స్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి

పోలింగ్ స్టేషన్లలో సదుపాయాలపై సమీక్ష

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లలో సీనియర్ ఓటర్లు వారి ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు తీసుకోవాల్సిన సదుపాయాలపై సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు అధికారి వి మదన్మోహన్ రావు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో ఎప్పటికప్పుడు కల్పించాల్సిన సదుపాయాలను తమ దష్టికి తీసుకురావాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్, తాసిల్దార్ టి.రాజరాజేశ్వరరావు, మండల అభివద్ధి అధికారి ఐదం రాజు తదితరులు పాల్గొన్నారు.



తడి-పొడి చెత్త పై కళా జాత కార్యక్రమం

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

ప్రజాశక్తి-అంబాజీపేట

ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యవంతంగా జీవించవచ్చని సర్పంచ్ కాంగ్రేగుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. గంగలకుర్రు పంచాయతీ పరిధిలోని మంగళవారం సాయంత్రం డప్పు కళాకారులచే తడి - పొడి చెత్తపై కళా జాత ద్వారా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్ లో జరిగిన ఈ కళా జాత కార్యక్రమం ప్రజలను ఆకట్టుకుంది.

శ్రీనును విడుదల చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-రాజోలు:

దళిత యువకుడు జనిపెల్ల శ్రీనుని వెంటనే విడుదల చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. పొన్నమండ సిద్ధార్థ నగర్ లో మంగళవారం దళిత చైతన్య వేదిక నాయకులతో పాటుగా అంబేద్కర్ మెమోరియల్ విజ్ఞాన సమితి సభ్యులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. శ్రీనును వెంటనే విడుదల చేయ్యాలని నినాదాలు చేశారు. ఎఫ్ఎల్సీఎస్ అధ్యక్షులు కుసుమ రాజుకుమార్, మాల సంఘ అధ్యక్షులు మోకా ఇజ్రాయెల్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల విజయోత్సవాలు



అమలాపురంలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని, కుయుక్తులను సైతం ఎదుర్కొని సమ్మెను జయప్రదం చేసి తమ డిమాండ్లను సాధించుకున్న అంగన్‌వాడీలు మంగళవారం జిల్లాలో విజయోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొని అంగన్‌వాడీలకు అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అమలాపురం ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో విజయోత్సవ నిర్వహించారు. సమ్మెకు సంఘీభావం ప్రకటించిన సంఘాలకు వివిధ రాజకీయపార్టీలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం జీతాలు పెంచడానికి అంగీకరించి అంగన్‌వాడీ సంఘాలతో ఒప్పందం చేయడం హర్షణీయమని, అంగీకరించిన అంశాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు విజయ, బేబీ గంగారత్నం, జిల్లా ట్రెజరర్ పి.అమూల్యా లు మాట్లాడుతూ ప్రభుత్వం ఎటువంటి కక్ష సాధింపులకు పాల్పడకుండా ఉద్యోగుల హక్కులను గౌరవించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ కుయుక్తులను సంఘం అండతో ఉమ్మడిగా ఉద్యోగులంతా ఒక్కటై ఎదిరించడం అభినందనీయం అని అన్నారు. ఈ సందర్భంగా ఆటపాటలతో కేరింతలతో విజయోత్సవ సభ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జి.దైవకప, రత్నకుమారి, మణి మాల తదుతరులు నాయకత్వం వహించారు.

రామచంద్రపురం తమ న్యాయమైన డిమాండ్స్ కోసం అంగన్‌వాడీలు వర్కర్లు శాంతియుతంగా సమ్మె నిర్వహించి విజయం సాధించారని రామచంద్రపురం డిఎస్‌పి ప్రసాద్ పేర్కొన్నారు. తమ సమస్యల మీద 42 రోజుల సమ్మె చేసి ప్రభుత్వం జరిపిన చర్చలతో సమ్మెను విరమించడం జరిగిందనీ దీనితో వారు విజయోత్సవం జరుపుకున్నారన్నారు. విజయోత్సవానికి డిఎస్‌పి ప్రసాద్ తో పాటు, డాక్టర్ స్టాలిన్ పాల్గొని అంగన్‌వాడీలను అభినందించారు. కార్మిక సంఘం నాయకులు గోపాల్ రావు మాట్లాడుతూ ఈ 42 రోజు సమ్మెలో 12 మంది అంగన్వాడీలు చనిపోవడం బాధాకరమని ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ఎం.దుర్గమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వీరలక్ష్మి మాట్లాడుతూ 42 రోజుల నుంచి సమ్మె చేస్తున్న తమకు మద్దతు తెలియజేసిన ప్రజా సంఘాలకు, పార్టీలకు, మీడియాకు, పోలీస్ లకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. విజయోత్సవంలో మున్సిపల్ నాయకులు బాబురావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, రామచంద్రపురం నియోజకవర్గ అభ్యర్థి కోట శ్రీనివాస్, లాయర్ చిట్టిబాబు, కృష్ణ, ప్రజానాట్యమండలి ప్రేమానందం, అంగన్‌వాడీ నాయకులు సూర్య కుమారి, శ్రీదేవి, దుర్గ, జహెర, చంద్రకళ, విజయలక్ష్మి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** కార్మిక సంఘాల మద్దతుతో ప్రభుత్వం పై సమిష్టిగా పోరాడి డిమాండ్లు సాధించుకోవడం జిల్లా సిఐటియు కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్ హర్షం వ్యక్తంచేశారు. సమ్మెకు సహకరించిన ప్రజలకు, మీడియాకు, పాత్రికేయులకు దుర్గా ప్రసాద్ కతజ్ఞతలు తెలిపారు. చర్చలు సపలికతం కావడంతో ముమ్మిడివరం ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులు మంగళవారం సిడిపిఒ విమలకు విధుల్లో చేరుతున్నట్లు అంగీకార పత్రం అందించేందుకు భారీ గా కార్యాలయానికి చేరుకుని అంగీకార పత్రాలు అందజేశారు.



అమలాపురంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



రామచంద్రపురం విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న డిఎస్‌పి ప్రసాద్



సిడిపిఒకు విధుల్లో చేరుతున్న పత్రాలు అందిస్తున్న ముమ్మిడివరం ప్రాజెక్ట్ అంగన్‌వాడీలు


అంగన్‌వాడీలకు అభినందనలు

సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- అమలాపురం

అంగన్‌వాడీలు 42 రోజులుగా మొక్కవోని పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని, కుయుక్తులను సైతం ఎదుర్కొని సమ్మెను జయప్రదం చేసి, తమ కోర్కెలు సాధించుకున్నందుకు వారికి సిపిఎం జిల్లా కమిటీ అభినందనలు తెలియజేస్తున్నదని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎటువంటి కక్షసాధింపులకు పాల్పడకుండా ఉద్యోగుల హక్కులను గౌరవించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టించిన రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలయ్యిందని లబ్ధిదారులు, ప్రజలు ప్రభుత్వ చర్యలను నిరసించి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు అండగా నిలబడ్డారని అన్నారు. ఎస్మాను ధిక్కరించి నిలబడ్డారు. కలెక్టర్లు నోటీసులిచ్చినా అంగన్వాడీలు బెదరలేదన్నారు. తిరిగి సమాధానమిచ్చారు. ఉద్యోగాలు పీకివేస్తామని, కొత్త రిక్రూట్మెంట్ చేసుకుంటామని నోటీసులిచ్చి, భయపెట్టి, బెదిరించినా లొంగలేదన్నారు. కార్మికుల ఐక్యత, ఇతర సంఘాల, రంగాల కార్మికుల సంఘీబావం, ప్రజల మద్దతు అవసరమని అంగన్‌వాడీల సమ్మె తెలియజేస్తున్నదన్నారు.. సమ్మెకు మద్దతు తెలియజేసిన ప్రజలకు, జిల్లా కమిటీ ధన్యవాదాలు తెలియజేస్తున్నదన్నారు.

కార్టూ'నిజం'



ఇక్కడ కూడా అమ్మ భాషకు ప్రాణ ప్రతిష్ట చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది సార్..!!

ఘనంగా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అంబాజీపేట నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు అంబాజీపేట లో మంగళవారం మండల టిడిపి, జనసేన నాయకులు ఆధ్వర్యంలో పోలీస్టేషన్ ఎదురుగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేకు కట్ చేసి అభిమానులకు పార్టీ శ్రేణులకు పంచారు. కార్యక్రమంలో నామన రాంబాబు, డొక్కానాథ్ బాబు,మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు డిశ్రీనురాజు, గూడాల ఫణి, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు, డి.సాయికష్ణ, డివివి.సత్యనారాయణ, గణపతి వీర రాఘవులు,అరిగెల బలరామూర్తి, గంగుమళ్ళ వీరభద్రరావు,పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి తదితరులు పాల్గొన్నారు. **మండపేట** నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబులు కేకు కట్ చేసి అభిమానులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. **మామిడికుదురు** పి.గన్నవరం నియోజకవర్గం నాయకులు నగరం గ్రామశాఖ అధ్యక్షులు జాలెం సుబ్బారావులి అధ్యక్షతన నగరం లో ఇంటివద్ద కేక్ కట్ చేసి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలియజేసారు తదనంతరం నగరం పిహెచ్‌సి నందు పండ్లు పంచిపెట్టి, మొగలికుదురు అనాదాశ్రమంలో అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగరం సర్పంచ్ జాలెం రమణ కుమారి , జాలెం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముందుగా మెయిన్ రోడ్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేకు కట్ చేసి స్వీట్స్, పండ్లు, కేకు పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వంటిపల్లి సతీష్ కుమార్, ఈదల నల్లబాబు, రామానుజునుల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం(అల్లవరం)** అల్లవరం మండలం కోడూరుపాడు టిడిపి కార్యాలయం వద్ద నారా లోకేష్ పుట్టినరోజును పురస్కరించుకుని అల్లవరం మండల టిడిపి అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబు రాజు మరియు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గొలకోటి చిన్నా ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. టిడిపి అమలాపురం నియోజకవర్గ ఇంచార్జ్ అయితాబత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో జరిగిన వేడుకల్లో టిడిపి, జనసేన శ్రేణులు

రామచంద్రపురం ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం ఎస్ఐ గా పనిచేసి బదిలీపై వెళుతున్న ఎస్ఐ సురేష్ బాబుకు సిఐటియు ఆధ్వర్యంలో సన్మానించారు. సిఐటియు నాయకులు నూకల బలరాం, అంగనవాడి జిల్లా కార్యదర్శి దుర్గమ్మ, రామచంద్రపురం ప్రాజెక్టు ప్రెసిడెంట్ వీరలక్ష్మి , యూనియన్ నాయకులు సూర్య కుమారి, శ్రీదేవి,దుర్గ అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు .నూకలబలరాం, దుర్గమ్మ మాట్లాడుతూ ఎస్ఐ సురేష్ బాబు దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరిస్తూ ప్రజల మన్ననలను పొందారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



ఎస్ఐ సురేష్‌బాబును సత్కరిస్తున్న సిఐటియు నేతలు


25న అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25 న అవగాహన ర్యాలీ మరియు వివిద రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్స్ మరియు మేమొంటో లు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి మరియు ఆసెంబ్లీ నియోజకవర్గ తహశీల్దార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా 25న నియోజక వర్గ ప్రధాన కేంద్రమైన ముమ్మిడివరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉదయం 9.30 గంటలకు ఓటర్ అవగాహన ర్యాలీ ని నియోజక వర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జెండా ఊపి ర్యాలీ నీ ప్రారంభిస్తారన్నారు.

స్ఫూర్తినీయుడు పొన్నాడ

నేడు రాజోలులో హనుమంతరావు విగ్రహావిష్కరణ



ప్రజాశక్తి-రాజోలు

న్యాయవాదిగా, గాంధేయవాదిగా, సామాజిక వేత్తగా నేటి తరానికి స్ఫూర్తినీయుడిగా నిలిచారు రాజోలుకు చెందిన పొన్నాడ హనుమంతరావు. మరణించి ఏడాది పూర్తయినా ఆయన చేసిన సేవలు, ఆయన జ్ఞాపకాలు ప్రజల మదిలో ఇంకా మెదులుతూనే ఉన్నాయి. నేడు రాజోలులోని గాంధీ హౌస్‌లో ప్రథమ వర్ధంతి సందర్భంగా పొన్నాడకాంస్య విగ్రహం, పొన్నాడ జీవిత ప్రస్థాన పుస్తక ఆవిష్కరణలు జరుగనున్నాయి.

పొన్నాడ హనుమంతరావు గాంధేయవాది. చివరి వరకూ ఆయన ఆదే బాటలో నడిచారు. రాజోలు సర్పంచిగా పట్టణ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారు. న్యాయ విజ్ఞాన దర్శిని, న్యాయశాస్త్రాన్ని తెలుగులో అనువాదం చేయడంతో పాటు రచయితగా అనేక రచనలు చేశారు. అధ్యాపకునిగా పని చేసిన ఆయన ఏడు పదులు వయస్సు దాటినా కళాశాలకు వెళ్లి విద్యార్థులకు ఉచితంగా వ్యాపార, న్యాయశాస్త్ర పాఠాలు చెప్పేవారు. ఆధ్యాత్మికతతో పాటు అనేక స్వచ్ఛంద సేవలందించి అనేక బిరుదులు, పురస్కారాలు అందుకున్నారు.



ఎంఎల్‌సి రావాక వరప్రసాదరావుతో ముచ్చటిస్తున్న పొన్నాడ (ఫైల్)

న్యాయవాదులకు ఆదర్శంగా..

న్యాయవాది ఒక్క న్యాయశాస్త్రాన్నే కాదు.. తన విజ్ఞానంలోకి అనేక తలుపులు తెరవాలి. వ్యవసాయం, వ్యాపారం, రాజకీయం, సమాజం, సైన్సు, చరిత్ర ఇలా అన్ని తలుపులు తెరిచే అన్ని అంశాల సారంగా న్యాయవాద విస్తతమవుతాడు. ఈ అన్ని అంశాల్లో పట్టున్న వ్యక్తి పొన్నాడ హనుమంతరావు. 57 ఏళ్లపాటు న్యాయవాద వృత్తిలో ఉండగా కొన్ని వందల క్రిమినల్ కేసులను వాదించి విజయం సాధించిన ఘనుడు ఆయన. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఫిర్యాదుదారుల తరుపున వాదించి అనేక కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చూశారు. న్యాయవాదిగా ఉంటూనే గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేశారు. మహాత్మ గాంధీ బస చేసిన తన గృహాన్ని ఇప్పటికీ చెక్కుచెదరకుండా కాపాడుకుంటూ గాంధీ హౌస్‌గా మార్చారు. అంతేకాకుండా సమాజానికి ఉపయోగపడే చట్ట పరిజ్ఞాన ఏడు పుస్తకాలను తెలుగులో రచించి యువ న్యాయవాదులకు ఆదర్శంగా నిలిచారు.

నిబద్ధతతో సమాజ సేవ

హనుమంతరావు చిన్ననాటి నుంచి సేవా కార్యక్రమాలు చేసేవారు. విద్యాభివృద్ధికి విలువైన సేవలందించారు. 1948 వరకు కోనసీమ విద్యార్థులు కళాశాల విద్యకోసం రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్ళిన వచ్చేది. 1966లో రాజోలులో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు కోసం పెద్దలను సమావేశపరచి కళాశాల శంకుస్థాపనకు పునాది వేశారు. విరాళాలు సేకరించి, తన వంతు సాయం అందించి అప్పటి రాష్ట్ర మంత్రి రుద్రరాజు రామలింగరాజు అండతో 1968లో కళాశాల స్థాపనకు ముఖ్య కారకుడు అయ్యారు. 1979లో ఆర్‌టిసి డిపో ఏర్పాటు, 1980లో రాజోలు గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి,1984లో రాజోలు ఫైర్‌స్టేషను ఏర్పాటులో ముఖ్యభూమిక పోషించారు. బలిజిన వర్గాల వారందే పేటకు రహదారి కోసం తన విలువైన భూమిని పంచాయతీకి రాసిచ్చారు.

గాంధీ హౌస్ పరిరక్షణలో..

స్వాతంత్య్ర ఉద్యమంలో భాగంగా మహాత్మాగాంధీ కోనసీమలో పర్యటించారు. 1929లో మే 5న రాజోలులో పొన్నాడ సూర్యారావు ఇంట్లో ఆయన



గాంధీ భవన్‌ను సందర్శించిన ఎంఎల్‌సి వివితో పొన్నాడ (ఫైల్)

ఒకరోజు బస చేశారు. ఆ గహాన్ని ఇప్పటికీ గాంధీ హౌస్‌గా పిలుస్తారు. రాజోలులోని సీనియర్ న్యాయవాది పొన్నాడ హనుమంతరావు తండ్రి పొన్నాడ సూర్యారావు గృహంలో గాంధీ సమావేశమై ఉద్యమాల గురించి చర్చించారు. ఈ పర్యటన వల్లే 1930లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో ఇక్కడివారు భాగస్వాములయ్యారు. ఈ సత్యాగ్రహాన్ని గాంధీ దేశవ్యాప్తంగా నాలుగు గ్రామాల్లో నిర్వహించారు. అందులో రాజోలు కూడా ఒకటి. 1931లో విదేశీ వస్తువుల బహిష్కరణ ఉద్యమం ప్రారంభించిన దశలో రాజోలు పాత గ్రంథాలయం వెనుక పెద్దఎత్తున విదేశీ వస్తువులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. 1935లో కాంగ్రెస్ స్వర్ణోత్సవాలను పొన్నాడ సూర్యారావు ఘనంగా నిర్వహించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమాన్ని రాజోలులో చేపట్టి మద్దతుగా నిలిచారు. ఆ జ్ఞాపకాలన్నీ పొన్నాడ సూర్యారావు తన డైరీలో రాసుకున్నారు. దీంతో అప్పటి నుంచి ఆ ఇంటిని గాంధీ హౌస్‌గా మార్చేశారు. ఎంతోమంది ప్రముఖులు ఈఇంటిని సందర్శించి వెళ్లారు. మాజీ భారత ప్రధాని రాజీవ్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి వంటి వారు ఈ హౌసును సందర్శించారు.

నేరాలు ఘోరాలు

ఎసిబికి చిక్కిన ఇరిగేషన్ ఇఇ, జెఎ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రగతి భవన్లోని నీటిపారుదల శాఖకు చెందిన మానిటీ కలువల విభాగం కార్యాలయంపై ఎసిబి అధికారులు మంగళవారం దాడులు చేశారు. డ్రయినేజీ డివిజన్ కార్యాలయంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన పలివెల త్రిమూర్తులకు రావాల్సిన పింఛన్ల బకాయి నిమిత్తం డ్రయినేజీ డివిజన్ ఇఇ కొడాలి ఏడుకొండలు, జూనియర్ అసిస్టెంట్ కొల్లాటి స్వామి రూ.16 వేలు డిమాండ్ చేశారు. దీంతో ఆయన ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం సంబంధిత అధికారులు బాధితుడు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడి చేసి అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని రాజమహేంద్రవరం ఎసిబి కోర్టులో హాజరుపరుస్తామని డిఎస్‌పి శ్రీహరిరాజు మీడియాకు వెల్లడించారు. ఈ దాడుల్లో సిఐలు డి.వాసుకృష్ణ, వై.సతీష్, బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డిమేటు దగ్ధం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని గోరింట గ్రామ శివారులోని నాని అనే రైతు పొలంలోని పశువుల శాల వద్ద ఉన్న పెద్ద గడ్డిమేటు మంగళవారం దహనం అయ్యింది. విద్యుత్ వైర్ల మధ్య షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రమాద వార్త తెలిసిన వెంటనే పెద్దాపురం ఫైర్ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకూ నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారులో 6 కేజీల గంజాయిని మోటార్ సైకిల్‌పై తరలిస్తుండగా సంబంధిత వ్యక్తిని అరెస్టు చేయడంతోపాటు, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ లక్ష్మణరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం గ్రామానికి చెందిన షేక్ బాబ్జి బాబా విశాఖపట్నం వైపు నుంచి గుంటూరు వైపు వెళుతుండగా సమాచారం తెలుసుకున్న గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ సిబ్బందితో వెళ్లి తనిఖీ చేసి ఆయువులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముద్దాయి షేక్ బాబ్జి బాబాను కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

84 మద్యం బాటిల్స్ స్వాధీనం

ప్రజాశక్తి - కరప

మండలంలోని సావారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి 80 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన వాసంశెట్టి సత్యనారాయణ చుట్టూ ప్రక్కల గ్రామాలలో ఉన్న వైన్ షాపుల నుంచి మద్యం బాటిల్స్ కొనుగోలు చేసి బ్లాక్‌లో అమ్మకం చేస్తుండగా తన ఇంటి వద్ద దాడి నిర్వహించినట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు అతని ఇంటిని తనిఖీ చేయడంగా 84 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముద్దాయిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



స్టడీ మెటీరియల్ అందజేసిన ఉపాధ్యాయులు

యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పదో తరగతి పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులకు యుటిఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం భీమనపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం ఎన్.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు అందజేశారు. యుటిఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించే కార్యక్రమాన్ని అమలాపురం నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పీడీ కామన మధుసూదనరావు, ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న రాణి

మెప్మా ఆధ్వర్యంలో హ్యాండ్ వాష్ స్టేషన్

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ స్టేషన్ ను ఏర్పాటు చేసిందన్నారు. ఆరోగ్యకరమైన జీవితానికి ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ కె. శ్రీనివాసు, ఏఈ లు శ్రీనివాసరావు, పవన్, మెప్మా టిఎంసి అనంతలక్ష్మి, సిఓ రమాదేవి,ఆర్పీలు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

స్వాతంత్య్ర సమరయోధుడు ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని జయంతిని ద్రాక్షారామ లోని బోస్ సెంటర్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మేడిశెట్టి శేషారావు, పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. **మండపేట** స్థానిక సంగమేశ్వర కాలనీలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్యాలమాణిక్యం, ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



అప్పనపల్లి హైస్కూల్లో ట్యాబ్లు అందజేస్తున్న సర్పంచ్

8వ తరగతి విద్యార్థులకు మంగళవారం పలుచోట్ల ట్యాబ్‌లను పంపిణీచేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

మామిడికుదురు ట్యాబ్ లను విద్యార్థులు సద్వి నియోగం చేసుకుని సాంకేతిక పరిజ్ఞానం తో ఉన్నత శిఖరాలు అదిరోహించాలని సర్పంచ్ గేద్దం మంగాలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు బొంతు నీలిమలు అన్నారు. అప్పనపల్లి హైస్కూల్ నందు మంగళవారం హెచ్ఎం.బాదరాజు సూర్య ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 8వ తరగతి విద్యార్థులు 31మందికి ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్ లను అందజేశారు. ఇంప్లిమెంట్ ఎజెన్సీకి మధ్యాహ్నభోజన వంట పాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.కంకిపాటి వెంకటేశ్వరరావు, తలా గోపాలకృష్ణ, జి. వెంకటేశ్వరరావు, తలా నాగరాజు, మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **అలమూరు** మండలంలోని



చెముడులంకలో ట్యాబ్లు అందుకున్న విద్యార్థులతో శ్రీనివాస్

చెముడులంక ఎస్‌టిఎస్‌ఎస్ఎమ్ జెడ్‌పి హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు జగనన్న ఉచిత ట్యాబ్లు సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దొండపాటి చంటి, సొసైటీ డైరెక్టర్ అడబాల వీర్రాజు, వైసిపి గ్రామ అధ్యక్షులు దొండపాటి వెంకటేశ్వరావు, నేతలు బడ్డిగ వీర వెంకట్రావు, మోటూరి సురేష్, పలువురి రాధాకృష్ణ, హెచ్ఎం శివకుమార్, పిడి సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాగ్దేవి స్కూల్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-అమలాపురం

రామచంద్రాపురంలో సైన్స్ ఎగ్జిబిషన్ కాంపిటీషన్ ఇటీవల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం లో వాగ్దేవి పాఠశాల విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం అభినందన సభ ఏర్పాటుచేశారు. సభలో పాఠశాల డైరెక్టర్ పరసా భరత్ పాల్గొని ప్రతిభ కనబరచిన వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ అవగాహనతో కూడిన అభ్యసనం ద్వారానే విజ్ఞానశాస్త్రంపై పట్టు సాధించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి-మండపేట



నివాళులర్పిస్తున్న కృష్ణవేణి తదితరులు

మండలంలోని కేశవరం గ్రామంలో 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త పి. శేషారత్నం గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి తదితరులు మంగళవారం పరామర్శించారు. శేషారత్నం మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం టెర్మినేషన్ చేస్తుందన్న ఒత్తిడిలో శేషారత్నం గుండెపోటుకు గురైందన్నారు. శేషారత్నం మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

25న కాకినాడలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కాకినాడ లో ఈ నెల 25న జరిగే సమావేశానికి హాజరు కావాలని ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ కోరారు. మంగళ వారం పట్టణంలో అసెంబ్లీ కన్వీనర్ వాకలపల్లి రాంబాబు అధ్యక్షతన పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో నియోజక వర్గం స్నాహిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జంగా గౌతమ్ మాట్లాడుతూ పిసిసి చీఫ్ వైఎస్.షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐసిసి సభ్యులు బీకల అబ్బాయి, ఉగ్గిరాల రఘునాథ్, పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** కాకినాడ లో ఈ నెల 25న జరిగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పార్టీ సీనియర్ నాయకుడు పి.జగ్గన్న రాజు స్వగృహం నందు మంగళవారం ముమ్మిడివరం అసెంబ్లీ కన్వీనర్ గెద్దం సురేష్ బాబు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది.

నియోజకవర్గం ఓటర్లు 2 లక్షల 147 మంది

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం అసెంబ్లీ నియోజక వర్గంలో మొత్తం 2 లక్షల 147 మంది ఓటర్లు ఉన్నారని ఆర్డీవో సుధాసాగర్ తెలిపారు. మంగళవారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికలపై అధికారులతో, రాజకీయ పార్టీలతోనూ సమావేశం నిర్వహించారు. రామచంద్రపురం తహశీల్దార్, ఎం వెంకటేశ్వరరావు, కాజులూరు మండల తాసిల్దార్, కె.గంగవరం తాసిల్దార్ వైద్యనాథ శర్మ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఆధ్వర్యములో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్ ఫ్రీ రివిజన్ యాక్టివిటీస్, నియోజక వర్గములో మండలముల వారీగా చర్చించారు.

మండపేటలో నియోజకవర్గంలో..

మండపేట మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాలలో 217465 మంది ఓటర్లు ఉన్నట్లు మండపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి వి. మదన్‌మోహన్ రావు తెలిపారు. మండలంలో 66, మునిసిపాలిటీలో 45, రాయవరంలో 53, కపిలేశ్వరపురంలో 58 మొత్తంగాను నియోజక వర్గంలోని 223 పోలింగ్ స్టేషన్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలోనూ ఓటర్ల తుది జాబితా విడుదల చేసామన్నారు.

జాబ్ మేళాలో 31 మంది ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం స్థానిక వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల నందు మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 31 మంది ఎంపికైనట్లు కళాశాల ముఖ్య అధికారి కె.వి.ఎన్. మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. 163 మంది పాల్గొనగా ఈ ఇంటర్వ్యూలో మొత్తం 31 మంది ఎంపికైనట్లు, వీరికి వార్షిక వేతనం రూ.3.6 లక్షలని ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎస్.నరసింహారావు, కరాటం ప్రవీణ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ వై.వరప్రసాద్, బి. శ్రీనివాస్, వికాస కోఆర్డినేటర్ రమేష్, మేనేజర్ వై. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణుల పాదయాత్ర

ప్రజాశక్తి - ఆలమూరు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించాలని కోరుతూ చింతలూరు టిడిపి నాయకులు, కార్యకర్తలు మంగళవారం చింతలూరు నుంచి వాడపల్లి వరకు పాదయాత్ర చేపట్టారు. నారా లోకేష్ పుట్టినరోజున ఈ పాద యాత్రను చేపట్టినట్లు చింతలూరు టిడిపి నేత పలిచర్ల కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు చిట్టి గంగరాజు, సీనియర్ నాయకుడు పైన్ల శేషుబాబు, టిడిపి రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి దండంగి మమత తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-ఆయినవిల్లి

మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జెడ్‌పిటిసి సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. ఆయినవిల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షులు మట్టపర్తి నాగ విజయలక్ష్మి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశానికి హాజరు కావలసిన పలు శాఖల మండల అధికారులు హాజరు కాకపోవడంతో ఈ సమావేశం ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని అధికారులు లేకుండా సర్వసభ్య సమావేశం ఏమిటని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ప్రశ్నించారు. దీనిపై ఎంపిడిఒ వివరణ ఇస్తూ సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. తొత్తరముడి, కె జగన్నాథపురం వెళ్లే రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా ఉందని దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి అని వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు ఎంపిటిసి సభ్యులు అధికారులను ప్రశ్నించారు

పది ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఈ ఏడాది జరిగే టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టేలా విద్యాశాఖాధికారులు లు సమన్వయంతో పని చేయాలని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి నాగమణి పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణం లోని ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియం హాలు నందు మంగళ వారం జిల్లా పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పది ఫలితాల పై సమీక్ష సమావేశం డిఇఓ కమల కుమారి అధ్యక్షతన జరిగింది. జిల్లా విద్యాశాఖ అధికారి కమల కుమారి మాట్లాడుతూ మార్చి 18 నుంచి జరిగే పది పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1894 మంది విద్యార్థిని,విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ ఎంఈఓ బొజ్జా రమణశ్రీ, జిల్లా విద్యాశాఖ ఏడి నక్కా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు ప్రాజెక్టు వర్కులు దోహదం

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రాజెక్ట్ వర్కులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను , ఆలోచనా విధానాన్ని మరింత పెంపొందిస్తాయని నగరం ఎస్‌వి వివిఎస్‌ఎస్.సురేష్ అన్నారు. మామిడికుదురు కి చెందిన నయినాల లిఖిత్ వర్ధన్ రాజమహేంద్రవరం శ్రీ చైతన్య పాఠశాలలో సి బ్యాచ్ లో 9 వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల్లో సొంతూరు వచ్చిన లిఖిత్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై ప్రాజెక్టు వర్కు రూపొందించగా వాటిని నగరం ఎస్ వి సురేష్ పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగాలు సాధనకు కావాల్సిన అర్హతలు, వేతనాలు, ఆయా ఉద్యోగాల్లో రాణించేందుకు అవసరమైన మెళకువలు పై లిఖిత్ రూపొందించిన ప్రాజెక్టు అభినందనీయం అని ఎస్‌వి పేర్కొన్నారు . భవిష్యత్ లో మరిన్ని రంగాలపై ప్రాజెక్ట్ లు రూపొందించాలని సూచించారు .